చెక్కుటద్దం

క్రోటన్ మొక్కలగుండా, అంచులుగా నాటిన యిటుక రాళ్ళ నడుమ, తెల్లటి యిసుక పరచిన సన్నటి బాటపైన మెల్లగా నడచి వెళ్తోంది వాసంతి. పచ్చని పందిరిలా పరచుకున్న ఆ వేపచెట్ల క్రింద నడవడం ఒక మధురమైన అనుభవం. ప్రభాత వాయువులు చల్లగా వీస్తున్నాయి. సూర్యోదయమైంది గానీ ఎండ యింకా చిటారు కొమ్మలతోనూ, సౌధోపరిభాగాలతోనూ దోబూచులాడుతోంది. తోటలో రకరకాల పువ్వులు విప్పారిన రేకులతో నవ్వుల వికాసాలను వెదజల్లుతున్నాయి. కానీ అలాంటి సుప్రభాతంలో గూడా వాసంతికి ఏదో కొరత వున్నట్లు తోచడమే ఆశ్చర్యం. నిజానికా వున్న కొరతేదైతే వుందో అది ఆ పరిసరాల్లో లేదు. బాహ్య పరిస్థితుల్లో దేనిలోనూ లేదు. అదెక్కడ వుందో వాసంతికి తెలుసు. కానీ ఆ విషయాన్ని మాటిమాటికీ తలచుకొడమంటే వాసంతికి మనస్కరించదు.

తెల్లటి చలువ దుస్తులు వాసంతి సౌందర్యాన్ని శరీరంలో ఎంతవరకు దాచిపెట్టాలో అంతవరకే దాచిపెడుతున్నాయి. అంగసౌష్ఠవానికి కొదువలేని రూపవిభవం ఆమెది. తన అందచందాలను నిలువుటద్దం ప్రస్తుతించని రోజు లేదు. స్నేహితురాండ్రు నిర్మల, కల్యాణి, మార్గరేటు సౌందర్యంతో ప్రసక్తి వచ్చినప్పుడల్లా తన స్వరూపాన్ని ఉపమాన వస్తువుగా వాడుకుంటారు. ఆ పొగడ్తలు ఒక పదేళ్ళకు మునుపు తన కెంతో గర్వాన్ని కలిగించేవి. కానీ గాలికే కరిగిపోయిన కర్పూరంలా ఆ గర్వం కాలగర్భంలో లుప్తమైపోయింది. తనకోసం వేచివుండీ వుండీ మేనత్త కొడుకు వేరే పెళ్ళి చేసుకున్నాడు. ఒక హెల్త్ యిన్స్పెక్టరు తనపైన మనసు పెట్టుకుని మజ్నూలా తయారైపోవడంతో అతడి హెల్త్ కాస్తా పాడైపోయేదాకా వచ్చింది చేతులు కాలకమునుపే అతడు ఆకులు పట్టుకుని గంతకు తగిన బొంతలాంటి ఒక సంబంధాన్ని ఒప్పుకుని యిప్పుడాపిల్లతో లక్షణంగా సంసారం చేసుకపోతున్నాడు. అసలీ మగజాతి తీరే యింత! నువ్వంగీకరించక

పోతే నుయ్యో గొయ్యో, విషమో, కాదో అంటూ ప్రతినలు పలుకుతారు. తీరా అంగీకరించకపోతే - పోత్తే పోయింది లెమ్మని యింకొక సబ్ స్టిట్యూట్‌తో సరి పెట్టుకుంటారు. అయినా పాపం! ఎంతకూ తాను తన సింహాసనంనుంచి దిగక పోతే వాళ్ళుమాత్రం ఎంతకాలమని తన హృదయద్వారాల దగ్గర ప్రేమభిక్షకోసం పడిగాపులు పడతారు? అందరూ ఒక్కొక్కరుగా వెళ్ళిపోయారు. ఇప్పుడు తాను గొంతెత్తి పిలిపించుకోడానికెవ్వరూ లేని పరిస్థితి మాత్రమే మిగిలింది!

వంతెన క్రింది నదీ ప్రవాహంలా కాలం తనపాటుకు తాను వెళ్ళిపోతోంది.

అవును. జీవితం కూడా నదిలాంటిదే! ఆనకట్ట వేస్తే పొలాలు పండించు కోవచ్చు, తోటలు పెంచుకోవచ్చు. కనుచూపుమేరకు సస్యశ్యామలంగా మార్చుకోవచ్చు. ఆనకట్ట వేయవు. ఏమౌతుంది? నీళ్ళన్నీ మున్నీటిపాలు. మియర్ వేస్ట్!

ఈ వూహ తానొక షెనుతుఫానులా తన మనశ్శాంతి నెక్కడ పాడు చేస్తుందోనన్న భయం ఒకటి క్రొత్తగా వాసంతిని పట్టుకుంది కానీ మనసు చాలా పెద్దది. నిషేధాజ్ఞలతో దానికి హద్దు ఏర్పరచడం చాలా కష్టం. కొందర్ని గురించి తలుచుకో కొన్నల్ని గురించి తలచుకో, తరులతా గుల్మాదుల్లో దేన్ని గురించైనా తలచుకో కానీ ఒక్క కోతిని గురించి మాత్రం తలచుకోవద్దు, అని నువ్వు నీ మనసుకు చెబుతాననుకో! ఊహూ, లాభం లేదు. నీ మనస్సెప్పుడూ కోతిపైనే వుంటుంది;

అలాంటి వాసంతి కానాటి వుదయం ఫిమేల్ వార్డు కల్లంత దూరంలో కాలువపైన కట్టిన పిట్టగోడ కానుకుని అంతకు మునుపెన్నడూ ఆసుపత్రి ముఖం చూడనివాడిలా ఆ పరిసరాలను పరకాయించి చూస్తూ నిల్చున్న ఒక యువకుడు కనిపించాడు.

మరీ అంత శ్రేయస్కరమైతే వాసంతి పట్టించుకొని వుండేది కాదేమో! ముప్పైకి ముప్పై అయిదుకు మధ్య ఎక్కడో ఊగిసలాడుతోంది అతడి వయస్సు.

ఎత్తయినవాడు. పసిమిమిసిగ్గులు వెదజల్లుతున్న దేహచ్ఛాయ. చెదరిపోయినా అందంగానే వున్న క్రాపింగు. నలిగి పోయినా నాజూకుగానే వున్న దుస్తులు. ఆ కళ్ళల్లో కాంతులున్నాయి. ఆ నిల్చున్న తీరులో హుందాతనం వుంది. అన్ని లక్షణాలూ బాగానే వున్నాయి. కానీ వాసంతికి నచ్చని దొక్కటే! చందమామలో మచ్చలా అంతటి అందగాడికి ఆ గడ్డమేమిటి ? అదిగూడా వారం పదిరోజుల ఏమరుపాటువలన ఏర్పడిన పసిగడ్డమైన వాసంతి పోనీ లెమ్మని మన్నించగలిగి వుండేది! అబ్బే, ఆ గడ్డాన్ని కెంతలేదన్నా రెండు మాసాల మోటు ప్రాయం వచ్చేసింది.

లోకంలో వాసంతికి నచ్చనివి చాలా వున్నాయి. ఆ జాబితాలో ముఖ్యమైనది గడ్డం. మగసిరికి లక్షణమైతే దాన్ని మాటిమాటికీ మగవాళ్ళు శుభ్రంగా తుడిచిపెట్టుకోడమెందుకో ఆమె కర్థగాదు. పూర్వం మన మహర్షులు గడ్డాలు పెంచుకునేవారంటే అందుకు అడవుల్లో సెలూనులు లేకపోవడమే కారణమని వాసంతి భావిస్తుంది. మరీ అంత ముమ్మరంగా గాకపోయినా, ఆ రోజుల్లో గూడా గడ్డాల సాగుబడి అక్కడక్కడా అరుదునైనా కనిపించక పోవడం లేదు. బహుశా వారం వారం, నెల నెలా సుంకాలు చెల్లించడానికి బద్ధకించడమే యిందుకు కారణమై వుంటుంది. ఈ విద్యలో ఎవరికివారే నిపుణులై పోవడానికి వీలుగా, షేవింగు సెట్లు చౌకగా లభ్యం కావడం ప్రారంభమైన తర్వాత స్వాములవార్ల చెంపలు గూడా సముద్రపు కెరటం పరామర్శించిపోయిన యిసుక వాలులా శుభ్రంగా వుండడం నేర్చుకున్నాయి. ఇట్టి పరిస్థితుల్లో ఒక యువకుడు బిరుసు గడ్డంతో సహజీవనం చేయగలగడమే విడ్డూరం!

వాసంతి లోపలికి వెళ్ళి స్టాఫ్ నోట్‌బుక్‌లో సంతకం పెట్టింది. ఛార్జీ అప్పగించి క్వార్టర్సుకు బయలుదేరుతున్న ముసలి నర్సు కమలమ్మ వెళ్తూ వెళ్తూ గడిచిన రాత్రి తొమ్మిది గంటలప్పుడు అడ్మిట్ అయిన కొత్త కేసును గురించి ప్రస్తావించింది. ఆమె ద్వారా తెలిసినవి తెలియగా మిగిలిన వివరాల కోసం రిజిష్టరు

తెరిచి చూచింది వాసంతి. పేరు సక్కుబాయి.వయసు ఇరవైఏడు, భర్తపేరు చంద్ర మోహన్. అతడు యల్ ఐ సి.లో ఉద్యోగి. ఆమెగారికి నిర్దిష్టంగా ఒక జబ్బంటూ లేదు. ఆ 'కాలం'లో వ్రాయబడిన పేర్లన్నిటినిబట్టి చూస్తే ఈ కేసొక జబ్బుల గుడారంలా వుంది.

వాసంతి మూడో నంబరు బెడ్ దగ్గరికి వెళ్ళేసరికి, ఉదయం తనకు కని పించిన యువకుడు యినుప కమ్మీల గదిలో నుంచి పేషంటుతో మాట్లాడు తున్నాడు.

చంద్రమోహన్ అన్న వ్యక్తి యితడేనన్నమాట !

వాసంతి సక్కుబాయివైపు చూచింది. కాదు కాదు. సక్కుబాయిలో చక్క దనాలకోసం వెదికింది. సన్నగా, పొడుగ్గా, నలుపుపాలే ఎక్కువగా వున్న రంగుతో, కోల ముఖంతో, చూడగానే చూపరులను ఆకర్షించే విలక్షణాలేవీ లేకుండా చాలా సాదాగా వుంది సక్కుబాయి. పది దృక్కోణాలనుంచి ఆమెను చూస్తే, ఏదైనా ఒక కోణంలోనుంచి ఆమె కాస్తా అందంగా కనిపిస్తే కనిపించ వచ్చు. ఏమైనా సక్కుబాయి అన్న పేరే వాసంతికి యింపితంగా లేదు. ఆ ఆకారమూ అందుకు తగ్గట్టే వుంది. కానీ యువకుడిదగ్గిరికి వచ్చేసరికి అతడి పేరు, ఆకారము గూడా బాగానే వున్నాయి. ఇక్కడ బాగుండనిది అతడి గడ్డమే! అయ్యో, ఇదేం మనిషమ్మా యితను! తన జీవితానికి సంబంధించినవన్నీ బాగానే వుండి తీరాలన్న పట్టింపు యితనికి లేదల్లేవుంది.

పది పదిహేను నిమిషాలు గడిచేసరికి మళ్ళీ ఒకసారి మూడో నంబరు బెడ్ వైపు చూడాలనిపించింది వాసంతికి! మరేం లేదు. పాపం, ఆ యువకుడింకా ఆ ఇనుప కమ్మీల దడిని పట్టుకుని వ్రేళ్ళాడుతున్నాడేమో! ఈ పేషంటుకు వరాం డాలో బెడ్ దొరికిన దొరికింది గానీ ఆ చంద్రమోహన్ గారికి నిలువుగాళ్ళ శిక్ష తప్పేటట్టు లేదు!

ఉదయం ఎనిమిది గంటలకు ప్రారంభమై, సాయంకాలం నాలుగింటికి

వాసంతికి డ్యూటీ పూర్తయిపోతుంది. డ్యూటీకి వచ్చినప్పటినుంచీ పదకొండు కొట్టే దాకా ఫీమేల్ వార్డు పరిసరాల్లోనే తారట్లాడుతూ వుండిపోయిన ఆ యువకుడు ఆ తరువాత ఒక అరగంట సేపటివరకూ వాసంతికి కనిపించలేదు. "ఫరవాలేదు ఇతడు భార్యను చూడకుండా గూడా కొంతసేపుండగలడు" అనుకుంది వాసంతి. ఆ రిలీఫ్ గూడా ఎంతోకాలం నిలిచి వుండలేదు. అతను భార్యను వదిలిపెట్టి వెళ్ళ దం గూడా భార్యకోసమే! ఆసుపత్రివారి ఆదరణపైన పెద్దగా నమ్మకం లేదేమో మరి, అప్పటికప్పుడే ఫ్రెష్‌గా తయారైన రొట్టెలను పార్సెలు కట్టించుకుని, నవ నవలాడుతున్న చీనీపళ్ళు బాగ్‌లో వేయించుకుని, ద్రాక్షపళ్ల పొట్లం చేత బట్టుకుని, ముఖంపైన క్రమ్ముతున్న చెమటనైనా తుడుచుకోకుండా అతడు తిరిగి వచ్చే శాడు. వచ్చినవాడు కాసేపు వేపచెట్టుక్రింద కూర్చుని సేదదీరవచ్చునుగదా! అత డిలో ఆ ధ్యాసే లేదు. ఈ స్థితిలో అతణ్ణి శీతావాతాతపాలేవీ బాధించేటట్టేలేవే! ఆహారం తీసుకున్న తర్వాత వెనువెంటనే వేడివేడిగా ఒక పానీయం సేవించక పోతే ఆ భార్యామణి కందిపోతుందేమో కరిగిపోతుందేమో నన్నట్టూ, అతడు ఫ్లాస్కు భుజానికి తగిలించుకొని మిడిమిడి ఎండలో మళ్ళీ నగరంలోకి దూసుక పోయాడు.

ప్రొద్దు పడమటికి వ్రాలాగానే ఎండ వరాండాలోకి వస్తుంది. అప్పట్లో తెరలు దించి పెట్టడం రివాజు. ఆ రోజు మధ్యాహ్నం అయ్యీ కాకమునుపే తెరలు దించేసింది వాసంతి. 'తెర తీయగరాదా' అంటూ నాదనామక్రియలోనో, నాటకు రంజిలోనో ఒకపాట పాడగానే తొలగిపోవడానికిదేం వేంకటేశ్వరుడిముందు వ్రేలాడు తున్న తెరగాదు. ఆసుపత్రి సిబ్బందిచేత, పైన చీలలకు బిగించబడి క్రింద బటన్ లకు తగిలింపబడిన తెర. ఇకమీదట అయ్యగారేం చేస్తారో చూడాలి...

అమ్మగారి కన్నిసదుపాయాలూ అమర్చిన తర్వాత, ఎప్పుడో ఆలస్యంగా భోజనానికి వెళ్ళిన చంద్రమోహన్ రెండు గంటలకు తిరిగివచ్చాడు. ఆపాటి కెప్పుడో తెరక్రిందికి వ్రాలింది కానీ వెయ్యి ప్రతిబంధకా లేర్పడినాసరే, తన నెవ్వరూ ఆపలేరన్న ధోరణిలో వున్నాడతను. అది హాస్పటలు. అందులో ఫిమేల్ వార్డు. ఆడవాళ్ళు పడుకున్న మంచాల నడుమనుంచీ వెళ్ళాలి. అందుకు ఆసుపత్రి

నిబంధనలనుమతించవు...ఇలాంటి చొప్పదంటు విషయాలను గురించి తలపెట్ట కుండా అతడు చరచరా లోపలికి వచ్చేశాడు. ముందుకు వెళ్ళిపోతున్నాడు. ఇప్పుడతని చేతిలో ఒక వారపత్రిక వుంది. 'ఈవారం పత్రికేనాండి?' అంటూ చేయి చాచింది వాసంతి. 'అవునండీ! నేను వారపత్రికలు చదవను. కానీ మా ఆవిడ కివంటే చెప్పరానంత పిచ్చి' అంటూ అతడొక క్షణమైనా ఆగకుండా లోపలికి సాగిపోయాడు.

వాసంతికి చెప్పరానంత కోపం వచ్చింది. వారపత్రికలు చదివే పిచ్చి వున్నది ఈయనగారి జనానా సుందరి కొక్కతెకే కాబోలు! మిగిలినవాళ్ళు ఈయనకు మనుషుల క్రిందనే లెక్క తగలగూడదా? ఐనా యితడేం మనిషి? ఒక అందం తెలియదు. ఒక చందం తెలియదు. సభ్యత, సంస్కారం గూడా యితడిలో అంతంత మాత్రంగానే వున్నట్టున్నాయి. లేకుంటే వారపత్రిక ఇవ్వకుండా వెళ్ళిపోతాడా?

సాయంకాలం నాలుగ్గంటలకు తన డ్యూటీ పూర్తికాగానే వాసంతి క్వార్టర్సుకు వెళ్ళిపోయింది. దగ్గరివాడైన ఒక వ్యక్తి మూలంగా పెద్ద పరాభవం జరిగినట్టు తాను కృంగిపోవడమెందుకో వాసంతికే తెలియదు.

ఆ యువకుడొకసారి కుతూహలంతో పరకాయించి చూచివుండినా చాలు, ఆమెకిలా అసంతృప్తి కలిగి వుండేది కాదు. అబ్బే, రాతిమనిషి. రాతియుగంనాటి మనిషి. ఒక అయిదు నిమిషాలు అతడితో మాట్లాడే అవకాశం లభిస్తేనా? "ఓయీ చిట్టి నాయనా! నువ్వు యల్. ఐ. సి. లో గొప్ప ఉద్యోగం చేస్తున్నావు సరే. నెలకైదారు వందల రూపాయలు సంపాదిస్తున్నావు. మంచిదే. అనేక విధాల నీది కొరతలేని జీవితంగా వుంది వుండవలసిందే. కానీ నీకీ భార్య ఏమిటి? ఇదెన్ని జన్మల గ్రహచారం నీకు! ఈవిడకు వచ్చిన జబ్బేమిటో డాక్టర్లే తేల్చలేక పోతున్నారు. నికరంగా జబ్బేమిటో తెలిస్తేగదా, మందులిచ్చి బాగుచేయడం! అంతవరకూ ఎన్ని మందులు వాడినా అవి గురిపెట్టకుండా వదిలిపెట్టిన బాణాలేగదా! అయ్యో పాపం! ఈ కష్టం నీకు రావలిసిందిగాదు అయినా ఏం చేద్దాం ఎవరి

బుద్ధి వాళ్ళకు వచ్చి, ఎవరికి నచ్చిన జంటను వాళ్ళెన్నుకునేదాకా మన సమాజంలో తల్లిదండ్రులు పూరుకోవడంలేదు. ఆ కొందరిపాటుకు ఫలితం యిది. జరిగి పోయిందానికి విచారించి లాభమేముంది? వద్దమ్మా వద్దు. బెంగపెట్టుకోడంవల్ల నీ ఆరోగ్యం కాస్తా పాడైపోవచ్చు. నీ స్ఫురద్రూపానికే సెగ రావచ్చు...

మగవాడి నిలా వాడలగొట్టి, దిగులు పుట్టించి చివరకు తామే ఓదార్చా లన్న కోరిక సహజంగా ఆడవాళ్ళ కందరికీ వుంటుందేమో మనకు తెలియదు. కానీ యిలాంటి ప్రసంగాన్ని చంద్రమోహన్ ఎంతవరకూ హర్షించగలడన్నదే వాసంతికి సందేహం. హర్షించినా హర్షించకపోయినా తన అభిప్రాయాన్ని చూచాయగానైనా చెప్పి తీరవలసిందే!

మరునాటి ఉదయం చంద్రమోహన్ వాసంతిని పలకరించాడు. 'నిన్నటిరోజు మీరు పత్రిక కావాలన్నారు గదండీ! ఇదిగో తీసుకోండి. మా ఆవిడ నిన్నటి సాయంకాలానికే దీన్ని చదివేసిందట' అన్నాడు.

పరిచయం యింకా ప్రారంభదశలోనే వుండిపోయింది గానీ, లేకుంటే ఆ పత్రికను తన భుజబలం కొద్దీదూరంగా గిరవాటు పెట్టి వుండేది వాసంతి.

చూస్తుండగానే నాలుగు రోజులు దొర్లిపోయాయి. పరిచయంకూడా నాలుగు మెట్లుపైకెక్కింది. గతుకుల్లేని రోడ్డుపైన మోటారుకారు పరుగెత్తినట్టుగా చంద్రమోహన్‌తో జంకుగొంకులు లేకుండా మాట్లాడంగూడా సుసాధ్యంగానే పరిణమించింది.

“చూడండి చంద్రమోహన్‌గారూ! నాకు మిమ్మల్ని చూస్తే చాలా జాలిగా వుంది” అంది వాసంతి.

“ఎందుకూ? ఎందుకూ” అన్నాడు చంద్రమోహన్.

“లేకపోతే జబ్బుమనిషితో ఎంతకాలమని వేగగలరండీ మీరు! ఇదెవరో ముసలివాళ్ళు, నర్సులు, ఆయాలు చేయవలసిన పని. శక్తి వంచన లేకుండా మీ

అవస్థలేవో మీరు పడుతున్నారు. తీసుకొచ్చి ఆసుపత్రిలో అడ్మిట్ చేశారు. డాక్టర్లున్నారుగదా, మరేం ఫరవాలేదులెమ్మనుకుంటున్నారు. కానీ విచారకరమైన విషయమేమిటంటే వైద్యశాస్త్రం సాధించే విజయాలకుగూడా హద్దంటూ ఒకటి వుండిపోయింది..."

ఇంకా ఆశ్చర్యంగానే వాసంతివైపు చూస్తున్నాడు చంద్రమోహన్ "అదేమిటండీ వాసంతిగారూ, అలా చెప్పేశారు! ఆంధ్రప్రదేశ్ అవతరణ ఇంక పది రోజుల్లో వుందనగా నాకు పెళ్ళయింది. పది పన్నెండేళ్ళయిందిగదూ! ఈ పన్నెండేళ్ళలో మా ఆవిడకు మచ్చుకొక్క సారైనా మెడికల్ ఎయిడ్ అవసరం కాలేదంటే నమ్మాలి మీరు! స్వభావ సిద్ధంగా ఆమెలో నిండైన ఆరోగ్యం తొణికిసలాడుతుండేది. ఇంకా నా సంగతి చెప్పండి! జలుబు, తలనొప్పి, కళ్ళు తిరుగడం – అలాంటి జబ్బులు నేను పిలవకపోయినా పలుకుతాయి. కానీ నేను మందులు తీసుకునిగాదు అవి నయంగావడం! మా ఆవిడ తన మాటలతోనే వాటిని మటుమాయం చేసివేసేది. "మీకేమండీ! బాగానే వున్నారే! ఏదీ లేవండీ, అలా పార్కుదాకా వెళ్దాం" అంటే, ఇంక పార్కునుంచి గుడి, గుడినుంచి సినిమా అలా అలా చక్కర్లుగొట్టి రాత్రి ఏ పదింటికో యిల్లుచేరుకునే వాళ్ళం, కాదంటే ఇదేం మాయదారి జబ్బోగానీ, ఇదొచ్చిరెండు మాసాలైంది. ఇదైనా పెద్ద జబ్బేమీగాదు! తిన్నతిండి బొత్తిగా జీర్ణంకాదంతే! ఆకలివేయదు. లేచి నిల్చోడానికైనా ఓపికుండదు. అంతటి నీరసమన్నమాట! ఐనా యిప్పుడేం చూచారు మీరు? ఆసుపత్రిలో చేర్చాక ఎంతో నయంకదూ? మధ్యాహ్నమయ్యేసరికి ఆవురావురంటూ ఆకలిగావడం రెండు రోజులనుంచే! ఆకలి వేయడం ఆరోగ్యలక్షణం కదటండీ! ఈ రోజు మధ్యాహ్నం పట్టెడన్నం కూడా తీసుకుంది, డాక్టరుగారి సలహాపైన. అంతెందుకూ, మీరు చూస్తూనే వుండండి వాసంతిగారూ! పదిరోజుల్లో మా ఆవిడకు పరిపూర్ణంగా ఆరోగ్యము కుదరడమూ ఖాయమే! అప్పుడు మేము మీకందరికీ థాంక్స్ చెప్పి, గుళ్ళో నాలుగు కొబ్బరికాయలు కొట్టి చక్కా ఇంటికి వెళ్ళిపోవడమూ ఖాయమే!"

వాసంతి వింటూనే వుందిగానీ, విన్న మాటలన్నీ ఆమె బుర్రకెక్కి వుంటాయా అన్నది సందేహమే!

చివరికామె ఎంతో ప్రయత్నంమీద తన మామూలు మూడ్స్‌లోకి రాగలిగింది.

"అలాగైతే మీ ఆవిడకి అనారోగ్యం దాపురించి రెండు మాసాలైందంటారా చంద్రమోహన్‌గారూ? అంటూ ప్రశ్నించిందామె, ఆలోచనా, పరాధీనగా చంద్ర మోహన్ గడ్డం వైపు చూస్తూ.

"అవునండీ! పాపం, పూర్‌గర్ల్. మా సక్కుకు నా అన్న వాళ్లెవరైనా వుంటే నేనొక్కణ్ణే! అయిదేళ్ళ పిల్లగానే తండ్రి పోయాడట. ఇటీవల తల్లిగూడా పోయింది. నాకైనా తల్లిదండ్రులైతే వున్నారుగానీ వాళ్ళెక్కడో దూరప్రాంతాల్లో వున్నారు. మా అన్నయ్యకు ఢిల్లీలో వుద్యోగం. ఉద్యోగవశాత్తు నేనిలా రావలసి వచ్చింది. ఇక్కడ నాకైనా, మా సక్కేనండీ దిక్కు...."

ఈ ప్రసంగం జరిగిన తర్వాత వాసంతి చంద్రమోహన్‌తో మాట్లాడడం క్రమంగా తగ్గి పోయింది.

సక్కుబాయి ఆరోగ్యానికి సంబంధించి నంతవరకు నర్సు వూహించిన దాని కన్నా, ఆవిడ భర్త వూహించిందే నిజమైంది. పదిహేను రోజులలో ఆమె ఆరోగ్యం చక్కబడింది. సెలవు తీసుకోవలసి వచ్చేసరికి వాసంతి డ్యూటీలో లేదు. తనకు మరీ మరీ థాంక్స్ చెప్పమన్నారట! మార్గరెట్ చెప్పింది.

• • •

రెండు మూడు వారాల తర్వాత ఒకనాటి సాయంకాలం బజారుగుండా వెళ్తోంది వాసంతి. బట్టల షాపులోనుంచీ వెలుపలికి వస్తున్న సక్కూబాయి ఆమెకు కనిపించింది. మునుపటిలా ఆమెనిప్పుడు చక్కనిచుక్క కాదనడానికి ధైర్యం చాలడం లేదు. కానీ ఆమెను వెన్నంటి మెట్లు దిగుతున్న ఆ యువకు

ఔవతు! నాలుగైదు క్షణాలు పరిశీలనగా చూచిన తర్వాతగానీ అతడు చంద్రమోహ నేనని పోల్చుకోలేక పోయింది వాసంతి. కారణం లేకపోలేదు. ఇప్పుడతనికి గడ్డం లేదు. సక్కుటాయి తనముఖం చూచుకోడాని కిప్పుడు నిలువుటద్దం అక్కర్లేదు. ఆ చెక్కుటద్దాలే చాలు!

—ఆంధ్రవారపత్రిక— 1966.